## క్రైం కథ

రాణి మోహనరావు

# టిక్. టిక్. టిక్

"నానాటి బ్రతుకూ నాటకం... కానడ కన్నది కైవల్యం...."

ప్రఖ్యాత గాయకుడు మురళీధర్ సుమధురస్వరం...ప్లేయర్ లోంచి వస్తోంది. ఆ పాట వింటూ మంచంమీద దొర్లసాగేను. నాకు సంగీతం అంటే మహా ఇష్టం. అందులో ముఖ్యంగా మురళీధర్ సంగీతం అంటే ఆరోప్రాణం. మురళీధర్ పాడిన కీర్తనలు, జానపద పాటలు ఎన్నో సీడిల్లో వున్నాయి. ఆయన సంగీతం ప్రత్యేక్షంగా వినే కన్నా... ఇలా సీడి ప్లేయర్ ద్వారా విని ఆనందించడం అంటేనే నాకిష్టం. ఏమాత్రం నాకు ఖాళీ దొరికినా ఆయన గానం వింటూ వుంటాను. పాట సాగుతూ వుంది.

"సార్!"

పిలుపొచ్చిన వైపు తలతిప్పేను. గుమ్మం దగ్గర మా వంట వాడు వెంకయ్య విగ్రహంలా నిల్చుని వున్నాడు.

వాడి వైపు చూసాను-

"తమ కోసం ఖూనీల కామరాజుగారు వచ్చేరు. హాల్లో కూర్చున్నారు" అని చెప్పి వంటింట్లోకి వెళ్లిపోయాడు.

మా వంటవాడు క్రైం బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ కామరాజుని ఖూనీల కామరాజు అని ముద్దుగా పిలుస్తాడు. ప్లేయర్ ఆపి మంచంమీంచి లేచి బాత్‌రూంలోకి వెళ్లాను.

0 0 0 0

"కామరాజ్ భాయ్! ఏమిటిలా ఉదయాన్నే వచ్చేవ్? ఎనీ న్యూస్" నవ్వుతూ అన్నాను.

"సారీ... ఆదిత్యరామన్... నీకో బ్యాడ్ న్యూస్..." అన్నాడు కామరాజు

"బ్యాడ్ న్యూసా?"

" ఔను... ప్రముఖ పారిశ్రామిక వేత్త-రాజకీయ నాయకుడు పిట్టాపరమశివరావు నిన్న రాత్రి హత్య చేయబడ్డాడు. అక్కడికి వెళుతూనే నీ వద్దకొచ్చాను. వెళదాం పద..." అన్నాడు కామరాజు.

పరమశివరావు, అటు రాజకీయాల్లోనూ ఇటు పారిశ్రామిక రంగాల్లోనూ మంచి పేరు పొందేడు. ఆయనకు ఒక్కర్తే కూతురు. బాగా చదువుకుంది. పరమశివరావుకి తోడుగా అతని మేనల్లుడు వున్నాడు.

అంతలో వంటవాడు వెంకయ్య మా ముందు ప్రత్యక్షమయ్యాడు.

"సార్! టిఫిన్ రెడీ! రండి" అన్నాడు.

" ఏం! చేసావ్?" అడిగాడు కామరాజు.

" ఇడ్లీ... ఉల్లిపెసరట్టు... ఉప్మా...సాంబారు, కొబ్బరి చట్నీ..."

"వెంకయ్య... పద వస్తున్నాం. రా! బ్రదర్" అన్నాడు కామరాజు లొట్టలేస్తూ...

ఇద్దరం డైనింగ్ రూంలోకి దారితీసేం.

0 0 0 0

గదిలో బోర్లా పర్వతంలా పడివున్నాడు పరమశివరావు. మాకన్నా ముందే అక్కడికి వచ్చేరు ఫోటోగ్రాఫర్, వేలిముద్రల నిపుణుడు వేళాయుధం. వారి పనులు వారు శ్రద్ధగా చేస్తున్నారు. పరమశివరావు శవాన్నిపరీక్షిస్తున్నాడు పోలీస్ సర్జన్ రామన్. నా కళ్లు గదినంతా చూసాయి. పరమశివరావు శవం వైపు మరోసారి చూసాను. అతడి కుడి చెయ్యి ముందుకు చాపి కుడిచేతి చూపుడు వేలు గోడవైపుకు ఆన్చి వుంది. నాకు ఆయన అలా వేలు ఆన్చడంలో ఏదో సందేశం వుందనిపించింది. ఒక్కసారి గోడ పైకి దృష్టి సారించేను. కంసుణ్ని సంహరిస్తున్న కృష్ణుడి చిత్రం వాల్ పెయింటింగ్ కనిపించింది. నా మెదడులో ఆలోచనలు ప్రారంభం అయ్యాయి.

"రామన్ భాయ్... పరమశివరావు హత్య ఎన్నిగంటలకు జరిగి వుంటుంది?" రామన్‌ని ప్రశ్నించేను.

"నిన్న రాత్రి... ఎనిమిది... ఎనిమిదిన్నర మధ్యజరిగి వుంటుంది. హత్య చాలా తెలివిగా జరిగింది. హతుడి శరీరంపై గాయాలు ఏమీ



లేవు. కత్తిపోట్లు లేవు.బహుశా హతుడు ఊపిరి ఆడక పోవడం వల్ల మరణం జరిగి వుంటుంది. వివరాలు పోస్టుమార్టం అయ్యాక చెపుతాను అన్నాడు పోలీస్ సర్జన్ రామన్.

పోలీస్ సర్జన్ రామన్ శవపరీక్షలో మంచి అనుభవం వుంది. ఆయన నిర్ణయం తర్వాతే కేసు ముందుకు సాగుతుంది.

రామన్ సహాయం నాకు చాలా కేసుల్లో లభించింది. ఇక ఆ గదిలో నాకేం పనిలేదనిపించింది. పక్కగదిలోకి వెళ్లాను. నా వెనకే నా నీడలా అనుసరించాడు కామరాజు.

0 0 0 0

''మీ పేరు?''

''అవధాని సార్''

''మీరిక్కడ ఏం పనిచేస్తున్నారు?''

''అయ్యగారి సెక్రటరీ సార్!''

''నిన్న మీరిక్కడే వున్నారా?''

''లేదండీ అర్జంట్ పనిపడి గోపాలపట్నం వెళ్లాను. తిరిగి ఇంటికి వచ్చేసరికి పదిగంటలు అయింది. ఉదయాన్నే ఇక్కడకురాగానే చెడు వార్త విన్నాను.' 'అన్నాడు అవధాని.

''పరమశివరావు హత్య గావింపబడ్డ వార్త ఎవరు పోలీసులకు చెప్పారు?''

''అయ్యగారి మేనల్లుడు గోపాలకృష్ణగారు'' అన్నాడు అవధాని.

''వెరీగుడ్ అవధాని గారూ...పరమశివరావు గారి అమ్మాయి ఏది? కనపడలేదు?''

''వనజగారా? ఆమె స్నేహితురాళ్లతో తిరుపతి వెళ్లారు.''

''దైవ దర్శనానికా?''

''కాదండి! ఆమె స్నేహితురాలి పెళ్లికి వెళ్లారండీ!''

'' ఆమెకు పరమశివరావుగారు హత్యకు గురి అయినట్లు కబురు చెప్పారా?''

'' ఆc... ఎస్‌టిడి చేసి ఆమెకు చెప్పాను సార్. రేపు ఉదయం ఇక్కడకు వస్తున్నారు.'' అన్నాడు అవధాని.

''అవధానిగారూ మంచి వివరాలు చెప్పారు. ఇక మీరు వెళ్లవచ్చు.'' అన్నాను.

అవధాని వెళ్లిపోయాడు.

అవధాని వెళ్లాక ఒక యువకుడు వచ్చేడు. అతడు ఆరోగ్యంగా, బలంగా వున్నాడు.

''మీ పేరు?''

''గోపాలకృష్ణ సార్''

''వెరీగుడ్ నేమ్. బైదిబై నిన్న రాత్రి ఏడు గంటల నుంచి ఎక్కడున్నారు?'' ప్రశ్నించాను.

''కళాభారతి ఆడిటోరియంలో''

''అక్కడెందుకున్నారు?''

''ప్రముఖ సంగీత విద్వాంసుడు మురళీధర్ గారి కచ్చేరి వుంది. అతని కచ్చేరి అంటే నాకు ఇష్టం సార్!'' అన్నాడు గోపాలకృష్ణ.

''మధ్యలో బయటకు వెళ్లారా?''

''లేదు సార్...నాతో పాటుగా సూర్యం వచ్చాడు సార్.''

''సూర్యం...?''

''నా క్లోజ్ ఫ్రెండ్ సార్!''

''అతనికి మ్యూజిక్ అంటే ఇష్టమా?''

'' ఆc... ప్రతీ కచ్చేరీకి వెళుతూ వుంటాడు.''

''వెరీగుడ్... అతని అడ్రసు చెప్పండి'' అడిగాను.

గోపాలకృష్ణ సూర్యం అడ్రస్ చెప్పాడు. కామరాజు సూర్యం అడ్రస్ నోట్ చేసుకున్నాడు.

''కచేరి అయ్యాక మీరు ఇంటికి రాలేదా?''

''లేదు సార్...''

'' ఎందుకని?''

''సూర్యం ఇంట్లో పార్టీ చేసుకున్నాం. తెల్లవారేక ఇంటికి వచ్చాను. మామయ్య గదిలో పడివున్నాడు. పోలీసులకు విషయం చెప్పాను సార్'' అన్నాడు గోపాలకృష్ణ.

0 0 0 0

గోపాలకృష్ణ గదిలోకి కామరాజుతో ప్రవేశించాను.

గది అంతా శుభ్రంగా వుంది. గదికి నైరుతీ మూల పెద్ద టేబుల్. ఆ టేబుల్ పై రేడియో (పాతది) ఆ రేడియోపై పాత టైంపీస్(గడియారం) – ఆ




రేడియో పక్కన కొత్తరకం టేప్ రికార్డర్ చూసాను.

"కామరాజు భాయ్ ఈ వస్తువులపై వేలి ముద్రలు తీయించేవా?"

"ఆc... తీయించేను. బ్రదర్..." అన్నాడు కామరాజు.

వెంటనే టేప్ రికార్డర్ ఆన్ చేసేను.

టేప్ తిరగడం మొదలైంది.

"శ్రీ మహాగణపతిని సేవింతురారే...

మానవులారా..." టేపులోంచి మురళీధర్ గానం చెవులకు స్వాగతం పలికింది.

రెండు సార్లు ప్లే చేసి శ్రద్ధగా విన్నాను. ఆ తర్వాత కీర్తన

"నగుమోము గనలేని... నీ జాలి.....

... నను బ్రోవరా..." మధురమైన

ఆకీర్తనతో పాటుగా పక్క వాయిద్యాలు వినిపిస్తున్నాయి. ఆ కీర్తనతో పాటుగా నెమ్మదిగా ఓ శబ్దం నా పాముచెవులకు వినిపించింది. మళ్లీ టేపును రివైండ్ చేసి విన్నాను. "టిక్..టిక్" అన్న శబ్దం మళ్లీ వినిపించింది. సౌండ్ పెంచి విన్నాను. నాతోపాటు కామరాజూ శ్రద్ధగా విన్నాడు. టేప్‌రికార్డర్ ఆఫ్ చేసి ఒక్కసారి నా దృష్టి రేడియో మీదకి వెళ్లింది. రేడియో మీదున్న గడియారం 'టిక్...టిక్' అని శబ్దం చేస్తోంది.

"బ్రదర్! ఈ బిగ్‌బెన్ గడియారం సౌండ్ టేప్ రికార్డర్‌లోంచి వస్తోంది. సంగీత కచ్చేరీ హాలులో ఈ సౌండ్ రావడం అసంభవం. ఇందులో ఏదో కిటుకు వుంది. ఆ కిటుకు కనుక్కుంటే కేసు పూర్తి అవుతుంది." అన్నాడు కామరాజు.

కామరాజు మాటలకు అంగీకారంగా తలవూపాను.

0 0 0 0

మీరు నన్నీ గండం నుంచి గట్టెక్కించాలి. కాపాడాలి! ఆదిత్యారామ్‌గారూ. మీకు అంతా చెప్తాను. ఆ గోపాల్ అదే గోపాలకృష్ణ గాడి మాయమాటలకు, వాడిచ్చిన సొమ్ముకు బానిసన య్యాను. ముందు మీకు నిజం చెప్పలేదు. ఆ తర్వాత బాగా ఆలోచించేను. ఒక వ్యక్తి నా వద్దకు వచ్చాడు. అతన్ని గోపాల్ పంపాడు. నన్ను ఈ నగరం నుంచి వెళ్లిపొమ్మన్నాడు. తను ఏ ఊరు వెళ్లేది ఈ రోజు ఈవినింగ్ ఆరుగంటలకు చెప్తానన్నాడు" చెప్పాడు సూర్యం.

"సూర్యం! నీకు పూర్తి రక్షణ క్రైం బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కామరాజు ఇస్తాడు." అన్నాను కామరాజు వైపు చూస్తూ...

"నీకు పూర్తి రక్షణ నేనిస్తాను..." హామీ ఇచ్చాడు కామరాజు.

"సూర్యం! జరిగింది మాకు చెప్పు" అన్నాను.

"నన్ను గోపాల్ బలవంతంగా సంగీత కచ్చేరీకి తీసుకువెళ్లాడు" అన్నాడు సూర్యం.

"నీకు సంగీత కచ్చేరీలు ఇష్టం లేదా?"

" ఇష్టమే కానీ ఆ రోజు నాకు మూడ్ బాగాలేదు. వాడి బాధ పడలేక వెళ్లాను" అన్నాడు సూర్యం.

"కచ్చేరీ అయ్యేంత వరకూ వున్నావా?"

" ఉన్నాను సార్! కానీ..."

" చెప్పు..." అన్నాను.

"మధ్యలో గోపాల్ పనుందని చెప్పి వెళ్లి.... పావుగంట తర్వాత వచ్చేడు.

"ఆ కార్యక్రమాన్ని రికార్డ్ చేసావా?" ప్రశ్నించాను.

"గోపాల్ చెయ్యమని బలవంతం చేస్తే... చేసాను సార్" అన్నాడు సూర్యం.

" ఆ టేప్ నీ నుండి గోపాలకృష్ణ తీసుకున్నాడా?" ప్రశ్నించాడు కామరాజు.

"ఆ.. ఆ రాత్రే తీసుకొని మర్నాడు ఉదయం ఏడింటికి టేపు రిటర్న్ చేసాడు సార్!" అన్నాడు సూర్యం.

ఒక్కసారి ఆ టేప్ ప్లే చెయ్యి" అన్నాను.

సూర్యం టేపును రికార్డర్‌లో వుంచి ప్లే చేసాడు.

నేనూ కామరాజు శ్రద్ధగా వినసాగేం.

0 0 0 0

"మీ పేరు?"

"వనజ సార్" అందామె.

"మీ నాన్నగారు హత్య గావించబడ్డారని చాలా మంది బాధపడ్డారు అన్నాను"

"ఔనండీ! మా నాన్నగారు... ఎంతో మందికి ఉద్యోగాలు వేయించారు. ఎన్నో గుప్త దానాలు చేసారు. అటువంటి వ్యక్తిని హత్య చేసిన హంతకుడిని మీరు పట్టుకొని కఠినశిక్ష వేయించాలి ఆదిత్యారామ్ గారు" అని చెప్పింది వనజ.

"వనజ గారూ! తప్పక మీ కోరిక తీరుస్తాను. ఆనాడు మహాత్మాగాంధీ గారికే గాడ్సే లాంటి శత్రువు వున్నాడు. అటువంటిది మీ నాన్నగారికి శత్రువులుండడంలో ఆశ్చర్యం లేదు. మీ బావపై మీ అభిప్రాయం?" ప్రశ్నించాను.

"మొన్న మొన్నటి వరకూ మా బావ గోపాల్ అంటే సదభిప్రాయం వుండేది. కానీ పోయిన శుక్రవారం నా స్నేహితురాల్ని బలాత్కరించబోతూ వుంటే నా దృష్టిలో పడ్డాడు. అతని నిజరూపం చూసిన తరువాత నా మనసు విరిగింది. మాన్నాకు గోపాల్‌పై మంచి అభిప్రాయం వుండేది. ఆ కారణాన అతనికి సగభాగం ఆస్తి రాశారు. నాన్నకు గోపాల్ విషయం చెప్పాను. నా స్నేహితురాలు కూడా గోపాల్ విషయం చెప్పింది. నాన్న తర్వాత గోపాల్‌తో గొడవపడ్డారు." చెప్పడం ఆపింది వనజ.

"వనజగారూ! మీ నాన్నగార్ని హత్య చేసిన హంతకుడు దూరంగా లేడు. మీ మధ్యే మసలుతున్నాడు. ఎల్లుండి సాయంత్రం హంతకుడ్ని మీ ముందు ఉంచుతాను" అన్నాను.

వనజ వెళ్లాక క్రైం బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ కామరాజు వచ్చాడు.

"కామరాజు భాయ్.... నువ్వు సూర్యం వద్ద వున్న టేప్ విన్నావు కదా?" ప్రశ్నించాను.

"ఔను బ్రదర్ విన్నాను." అన్నాడు కామరాజు.

"అయితే... గోపాల్ ఇంట్లో అదే గోపాల్‌కృష్ణ గదిలో విన్న క్యాసెట్‌కు సూర్యం గదిలో విన్న టేప్‌కు వున్న తేడా ఏమిటి?" ప్రశ్నించాడు.

"సూర్యం...గదిలో విన్న టేపులో గడియారం శబ్దంలేదు. కరతాళ ధ్వనులే వున్నాయి. గోపాలకృష్ణ గదిలో విన్న టేపులో గడియారం 'టిక్..టిక్' అన్న శబ్దం... వాయిద్యాల మధ్య వుంది. కరెక్టేనా... బ్రదర్" అన్నాడు కామరాజు.

"వెరీగుడ్...కామరాజు భాయ్... ఆరోజు మనం గోపాలకృష్ణ గదిలో వున్న టేప్‌లో కరతాళ ధ్వనులు వినలేదు. వాయిద్యాల మధ్య టైమ్‌పీస్ శబ్దం విని టేప్ రికార్డర్ ఆఫ్ చేసాం. ఆ తర్వాత మళ్లీ జాగ్రత్తగా గోపాలకృష్ణ గదిలో విన్న టేప్ ప్లే చేసి విన్నాను. కచ్చితంగా టిక్...టిక్... అనే శబ్దం విన్నాను. అంతే కాక ఇంకా విన్నాను." ఆగేను.

" ఏం విన్నావు బ్రదర్?"

కామరాజుకి వివరంగా చెప్పాను.

0 0 0 0

హాల్లో అంతా సమావేశమయ్యారు.

అవధాని, సూర్యం, గోపాలకృష్ణ, వనజ కుర్చీలో కూర్చున్నారు.

"పరమశివరావుగారి హత్య అతి తెలివిగా జరిగింది.

హంతకుడిని...తర్వాత మీకు పరిచయం చేస్తాను. ముందు ఈ హత్య ఎందుకు జరిగిందో చెప్తాను. పరమశివరావు వనజను తన మేనల్లుడు గోపాలకృష్ణకు ఇచ్చి పెళ్లిచేద్దామనుకున్నాడు. తన ఆస్తిలో సగభాగం అతనికి విల్లురాసారు. మేనల్లుడికి వున్న దురలవాట్లు...తన కూతురు స్నేహితురాలిపై అతడు చేయబోయిన దుశ్చర్య విని అతన్ని మందలించాడు. తను రాసిన వీలునామా రద్దుచేస్తానని గట్టిగా బెదిరించాడు. గడువు పెట్టాడు.

హంతకుడు పటిష్టమైన పథకం వేసాడు. ఆరోజు అంటే గడువు రోజున మరణ ముహూర్తం నిర్ణయించాడు. ఆరోజే నగరంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు మురళీధర్ కచ్చేరి కళాభారతిలో వుంది. ఆ కచ్చేరీకి హంతకుడు తన మిత్రుడిని తోడు తీసుకెళ్లి ఆ కార్యక్రమం రికార్డు చేయించాడు. పటిష్టమైన ఎలిబీ కోసం! ఎనిమిది గంటలకు హంతకుడు పరమశివరావు వద్దకెళ్లి తన పశుబలంతో అతని ముక్కు, నోరూ, మూసి నేల మీద బోర్లా పడేసాడు. ప్రాణం పోతున్న ఆయన చావు తెలివితో హంతకుడెవరో క్లూ ఇచ్చారు. ఆయన కుడిచేతి చూపుడు వేలును గోడకు అన్చి ప్రాణం వదిలారు. నేను ఆ గోడ వైపు చూసాను. కంసుణ్ని సంహరిస్తున్న కృష్ణుడు వాల్ పెయింటింగ్ అది. కృష్ణుడికి మరో పేరు గోపాల్...అంటే....గోపాలకృష్ణ అవచ్చని ఊహించి గోపాలకృష్ణ గదిని నేనూ క్రైం బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కామరాజు సోదా చేసేం." చెప్పడం ఆపి అందరి వైపు చూసాను.

" ఆదిత్య రామ్‌జీ! మీరు పరిశోధనలు చేయడం కన్నా డిటెక్టివ్ కథలు రాస్తే... మంచి పేరు వస్తుంది. ప్రయత్నించండి.." అన్నాడు గోపాలకృష్ణ.

నేను గోపాలకృష్ణ గదిలో టేప్ విన్నాను. గోపాలకృష్ణను ప్రశ్నించాను. ఆ తర్వాత గోపాలకృష్ణ స్నేహితుడు సూర్యం గదిలో వున్న టేపునూ నేను, కామరాజు విన్నాం. సూర్యాన్ని విచారించేను. అతడు జరిగింది చెప్పాడు. గోపాలకృష్ణ వద్ద వున్న టేప్‌లో కీర్తనల మధ్య ' ఆహా... ఓహో'అన్న మాటలున్నాయి. కానీ మధ్యలో గడియారం 'టిక్...టిక్' అన్న శబ్దం వినిపించింది. సూర్యం ఇంట్లో వున్న టేప్‌లో అవేవీ లేవు. గోపాలకృష్ణ ఎలిబీకోసం అంటే తను కచ్చేరీలో వున్నట్లు రికార్డు చేయించాడు. ఆ టేపును అలాగే వుంచితే గోపాలకృష్ణను ఎవరూ పట్టుకోలేరు. కానీ అతడు అతితెలివికి పోయి ఆ టేపును మళ్లీ రీ రికార్డ్ చేసాడు. ఆ రికార్డ్ చేస్తూ వుండగా రేడియో మీద వున్న గడియారం శబ్దాలూ రికార్డ్ అవడం.....గోపాలకృష్ణ గమనించలేదు. ఆ గడియారమే నాకు 'క్లూ' ఇచ్చింది. (అఫ్‌కోర్స్ పరమశివరావు కూడా కంసుణ్ని చంపుతున్న వాల్ పెయింటింగ్ క్లూ ఇచ్చారు) నా పరిశోధన ముందుకి సాగింది. గోపాలకృష్ణ 'హంతకుడు' అని రుజువైంది. కామరాజు నీ పనికానియ్" అన్నాను. కామరాజు గోపాలకృష్ణ చేతికి అరదండాలు వేసాడు.

★